


ఘనంగా సంకటహర చతుర్థి

ధర్మపురి: ధర్మపురి శ్రీలక్ష్మీనృసింహస్వామి అనుబంధ మహాగణపతి ఆలయంలో గురువారం సంకటహర చతుర్థి వేడుకలు ఘనంగా నిర్వహించారు.



మళ్లీ అవే ఓటు పాట్లు

రాజన్న సిరిసిల్ల జిల్లా వ్యాప్తంగా గురువారం జరిగిన ఎన్నికల్లో తప్పుల తడకలతో కూడిన ఓటర్ల జాబితాను అందుబాటులో ఉంచి గందరగోళాన్ని సృష్టించారు. 8లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
31.0/21.0

ఆకాశం ప్రకాశవంతంగా ఉంటుంది. వర్షం కురిసే అవకాశం లేదు. గాలిలో తేమ అధికంగా ఉంటుంది. చలిగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

ఆరునెలల చిన్నారితో పోలింగ్ విధులు



చిన్నారితో విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్ శిరీష

జగిత్యాలరూరల్: జగిత్యాల పట్టణ పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న మహిళా కానిస్టేబుల్ శిరీష గురువారం జరిగిన ఎన్నికల్లో బుగ్గారం మండలం యశ్వంతరావుపేటలోని పోలింగ్ కేంద్రంలో తన ఆరునెలల కూతురుతో విధులు నిర్వహించారు. పలువురు ఓటర్లు మహిళా కానిస్టేబుల్, ఆమె కూతురును చూసి అయ్యో అంటూ ఆప్యాయత వ్యక్తం చేశారు.

పోలింగ్‌బూత్ వద్ద సొమ్మసిల్లిన గర్భిణి



సొమ్మసిల్లి పడిపోయిన స్వప్న

ఇబ్రహీంపట్నం(కోరుట్ల): ఇబ్రహీంపట్నం మండలకేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పోలింగ్ బూత్‌వద్ద ఓటు వేసేందుకు క్యూలో నిల్చున్న గర్భిణి బాదత్ స్వప్న సొమ్మసిల్లి పడిపోయింది. వెంటనే వైద్య సిబ్బంది ఆమెకు బీపీ పరీక్ష చేశారు. ఓఆర్‌ఎస్ కలిపిన నీటిని తాగించి 108 అంబులెన్స్‌లో మెట్‌పల్లి ఆసుపత్రికి తరలించారు. కాగా సదరు మహిళ మధ్యాహ్నం వరకు ఆసుపత్రిలో చికిత్స పొంది అనంతరం ఓటు హక్కు వినియోగించుకుంది.

ఓటర్‌లిస్టులో దంపతుల పేర్లు మాయం



రమణాచారి, పద్మజ దంపతులు

ఇబ్రహీంపట్నం(కోరుట్ల): మండలంలోని గొడూర్ గ్రామంలో పోలింగ్ బూత్ వద్దకు ఓటు వేసేందుకు వచ్చిన దంపతులు సముద్రాల రమణాచారి, సముద్రాల పద్మజ పేర్లు ఓటర్ లిస్టులో లేకపోవడంతో అవాకయ్యారు. బీఎల్‌వోలు ఓటర్ లిస్టును పరిశీలించి పేర్లు లేవని చెప్పారు. దీంతో తమ పేర్లను ఓటర్ లిస్టులో నుంచి ఎవరు తొలగిస్తారు, కనీసం తమకు సమాచారం కూడా ఇవ్వలేదు. తాము ఓటు హక్కు వినియోగించుకునే అవకాశం కోల్పోయాం అని బీఎల్‌వోలతో వాగ్వాదానికి దిగారు. తమకు సంబంధం లేదని బీఎల్‌వోలు సమాధానం ఇవ్వడంతో భార్యాభర్తలిద్దరూ బాధపడుతూ అక్కడి నుంచి వెళ్లిపోయారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన



పోలింగ్ కేంద్రం వద్ద అధికారులు

కథలాపూర్(వేములవాడ): మండలంలోని తాండ్య్రాలలో పోలింగ్ కేంద్రాలను గురువారం జిల్లా ఎన్నికల పరిశీలకులు జగదీశ్ శోంకార్ పరిశీలించారు. పోలింగ్ బూత్‌లకు వెళ్లి వసతులు, పోలింగ్ జరుగుతున్న తీరును స్థానిక అధికారులను అడిగి తెలుసుకున్నారు.

ఎన్నికల వరకే.. తర్వాత ఒక్కటే..



ఒకేచోట కూర్చుని టీ తాగుతున్న బీజేపీ, కాంగ్రెస్, బీఆర్‌ఎస్ నాయకులు

రాయికల్(జగిత్యాల): అసెంబ్లీ ఎన్నికల వేళ బీఆర్‌ఎస్, బీజేపీ, కాంగ్రెస్ నాయకులు పోటాపోటీగా ప్రచారం చేయగా.. గురువారం రాయికల్ పట్టణానికి చెందిన ఈ ముగ్గురు కలిసి మేమంతా ఒక్కటే అంటూ టీ తాగడం ఆకట్టుకుంది. ఏదేమైనా ఎన్నికలు అయ్యేంత వరకు పోటాపోటీగా ఉంటామని, తర్వాత మేమంతా స్నేహంగా ఉంటామనే ఈ ఫొటో అందరినీ ఆలోచింపజేసింది.

ఓటెత్తారు

- జిల్లాలో ఎన్నికలు ప్రశాంతం
- గంటగంటకు పెరిగిన పోలింగ్
- అక్కడక్కడ కొద్దిసేపు మొరాయించిన ఈవీఎంలు
- చిన్నచిన్న ఘటనలు మినహా..
- జిల్లాలో పోలింగ్ 78.87 శాతం



పెగడపల్లిలో ఓటు వేసేందుకు బారులుతీరిన మహిళలు



రాయికల్‌లో పోలింగ్ సమయం ముగిశాక ఎన్నికల సామగ్రితో వెళ్తున్న సిబ్బంది



వెంగళాయిపేటలో తొలిసారి ఓటు హక్కు వినియోగించుకున్న బీటెక్ విద్యార్థి గ్రీష్మ

పోలింగ్ శాతం ఇలా..

ఉదయం 9 గంటలకు	10.82 శాతం
ఉదయం 11 గంటలకు	22.5 శాతం
మధ్యాహ్నం 1 గంటకు	46.14 శాతం
మధ్యాహ్నం 3 గంటలకు	58.64 శాతం
సాయంత్రం 5 గంటల వరకు	74.87 శాతం

జిల్లాలో పోలింగ్ శాతం

జగిత్యాల	74.87
కోరుట్ల	73.68
ధర్మపురి	77.50
జిల్లా మొత్తం	78.87

నోట్: కొన్ని సెంటర్లలో రాత్రి వరకు పోలింగ్ కొనసాగడంతో ఓటింగ్ శాతం మరింత పెరిగే అవకాశం ఉంది.

జగిత్యాల: జిల్లాలో శాసనసభ ఎన్నికల పోలింగ్ గురువారం ప్రశాంతంగా ముగిసింది. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్ ఆధ్వర్యంలో భారీ బందోబస్తు చేపట్టారు. బీఎస్‌ఎఫ్ బలగాలు ప్రతీ పోలింగ్ కేంద్రం వద్ద జాగ్రత్తలు తీసుకున్నారు. జిల్లాలో 7 గంటలకు ప్రారంభమైన పోలింగ్ చలితీవ్రత ఎక్కువగా ఉండటంతో ఉదయం మందకొడిగా సాగినా మెల్లిమెల్లిగా ఊపందుకుంది. ఉదయం 9 గంటల లోపు పోలింగ్ 10.82 శాతం, 11 గంటలకు 22.50 శాతం, సాయంత్రం 5 గంటల వరకు 74.87 శాతం నమోదైంది.

బారులు తీరిన ఓటర్లు

జిల్లాలో ఓట్లు వేసేందుకు జనం బారులు తీరారు. ఈసారి వృద్ధులు, యువతీ, యువకుల పోలింగ్ శాతం పెంచాలనే ఉద్దేశంతో ఆదర్శ పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. దివ్యాంగుల కోసం ట్రైసైకిళ్లను ఏర్పాటు చేయడంతో ఇబ్బందులు లేకుండా ఓట్లు వేశారు. జిల్లాలో మాక్ పోలింగ్ సమయంలో జగిత్యాల మండలం లక్ష్మీపూర్, రాయికల్ మండలం చింతలూరుతో పాటు, కొన్ని గ్రామాల్లో ఈవీఎంలు మొరాయించడంతో వెంటనే టెక్నికల్ వారితో మాట్లాడి సరిచేశారు. ఎక్కడ ఎలాంటి ఇబ్బందులు చోటుచేసుకోలేదు.



ఓటు హక్కు వినియోగించుకున్న రుక్కమ్మతో అధికారులు



ఓటు హక్కు వినియోగించుకున్న ఆండాళమ్మ

ఓటేసిన పండుటాకులు

జగిత్యాలరూరల్/రాయికల్: రాయికల్ మండలం బోర్నపల్లిలో 110 ఏళ్ల వయస్సుగల చెన్నమనేని ఆండాళమ్మ గురువారం ఓటు హక్కు వినియోగించుకుంది. అలాగే జగిత్యాల రూరల్ మండలం పొలాసకు చెందిన 105 ఏళ్ల రుక్కమ్మ ఎన్నికల సిబ్బంది సహాయంతో ఓటు వేసింది.

బీఎల్‌వోలు ఓటర్లకు ఇబ్బందులు కలగకుండా చూశారు. కొన్నిచోట్ల ఇంటింటికీ పోల్ చీటిలు అందజేయగా, మరికొందరికి అప్పటికప్పుడు కేంద్రాల్లో అందజేశారు. కొన్నిచోట్ల ఓటరు లిస్ట్‌లో పేర్లు లేకపోవడంతో ఇబ్బందులకు గురయ్యారు. జిల్లా కేంద్రంలోని ఇస్లాంపుర, గాంధీనగర్ సమీపంలో చిన్నచిన్న సంఘటనలు చోటుచేసుకోవడంతో పెద్ద ఎత్తున పోలీసు బలగాలు దిగాయి. వివిధ పార్టీలకు చెందిన నాయకులను సముదాయించి గొడవ జరగకుండా చూశారు. జిల్లా కేంద్రంలోని ధరూర్ క్యాంప్ జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో కలెక్టర్ యాస్మిన్ బాషా, అదనపు కలెక్టర్ లత ఓటు హక్కును వినియోగించుకున్నారు.సాయంత్రం 5 గంటల తర్వాత పోలింగ్ సమయం ముగియడంతో పోలింగ్ అధికారులు, సిబ్బంది ఎన్నికల సామగ్రితో వెనుతిరిగారు.

ఓటేసిన యువత

జిల్లాలో యువత పెద్ద ఎత్తున ఓటు హక్కు వినియోగించుకున్నారు. ముఖ్యంగా వారు ఓటు హక్కు వినియోగించుకునేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేపట్టడంతో వివిధ ప్రాంతాల నుంచి వచ్చి ఓటేశారు. అమెరికా, కెనడా, దుబాయ్, వివిధ దేశాల నుంచి వచ్చి యువత తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.

ఓటు హక్కు వినియోగించుకున్న జెడ్పీచైర్‌పర్సన్

జగిత్యాలరూరల్: జగిత్యాల రూరల్ మండలం గోపాల్‌రావుపేట గ్రామంలో జెడ్పీచైర్‌పర్సన్ దావ వసంత-సురేశ్ దంపతులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. జగిత్యాల రూరల్ మండలం, అర్బన్ మండలాల్లోని గ్రామాల్లో పోలింగ్ సరళిని జెడ్పీచైర్‌పర్సన్ దావ వసంత, ఎమ్మెల్యే సతీమణి రాధికతో కలిసి పరిశీలించారు.

ఓటేసిన అభ్యర్థులు

జగిత్యాలరూరల్: జగిత్యాల రూరల్ మండలం అంతర్గాం గ్రామంలో ఎమ్మెల్యే సంజయ్‌కుమార్, ఆయన సతీమణి రాధిక, మాజీ మంత్రి రాజేశంగౌడ్ గురువారం తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ధర్మపురి నియోజకవర్గ బీఎస్పీ ఎమ్మెల్యే అభ్యర్థి నక్క విజయ్‌కుమార్ దంపతులు జగిత్యాల రూరల్ మండలం లక్ష్మీపూర్ గ్రామంలో ఓటేశారు. మెట్‌పల్లిలో ఎమ్మెల్యే విద్యాసాగర్ రావు, బీఆర్‌ఎస్ అభ్యర్థి కల్వకుంట్ల సంజయ్ ఓటు హక్కు వినియోగించుకున్నారు.



ఓటు హక్కు వినియోగించుకున్న కలెక్టర్ యాస్మిన్ బాషా, అదనపు కలెక్టర్ లత



ఓటు హక్కును వినియోగించుకున్న ఎమ్మెల్సీ రమణ, కుటుంబ సభ్యులు



ఓటేసిన జెడ్పీచైర్‌పర్సన్ వసంత దంపతులు



ఓటేసిన బీఎస్పీ అభ్యర్థి నక్క విజయ్ దంపతులు



మల్లాపూర్‌లో ఓటింగ్ వివరాలు తెలుసుకుంటున్న డీఎస్పీ రవీందర్‌రెడ్డి



పెగడపల్లిలో సిబ్బందికి సూచనలిస్తున్న పోలీస్ అధికారి




ఓటింగ్ సరళిని పరిశీలిస్తున్న ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్



రాయికల్‌లో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న అబ్జర్వర్ బసవ రాజేంద్ర



మెట్‌పల్లి పరిధిలో ఓటు వేసేందుకు వస్తున్న దివ్యాంగులు



రాయికల్‌లో పోలింగ్ సామగ్రిని సీజ్ చేస్తున్న సిబ్బంది

ఎవరి ధీమా వారిదే..

“ జగిత్యాల/కోరుట్ల/గొల్లపల్లి: జిల్లాలో గురువారం జరిగిన ఎన్నికల్లో ప్రధాన పార్టీల అభ్యర్థులు ఎవరి ధీమా వారే వ్యక్తం చేశారు. గెలుపోటములపై అంచనాలు వేసుకుంటున్నారు. ఈసందర్భంగా ‘సాక్షి’తో మాట్లాడారు. ”

భారీ మెజార్టీతో గెలుస్తాం



గతంలో కంటే భారీ మెజార్టీతో గెలుస్తాం. కార్యకర్తలు, నాయకులు గెలుపు కోసం తీవ్రంగా కష్టపడ్డారు. ఓటర్లందరూ మావైపు ఉన్నారు. మరోసారి విజయం తథ్యం. చేసిన అభివృద్ధి, ప్రభుత్వం అందజేసిన సంక్షేమ పథకాలే గెలిపిస్తాయి. మా వెంటే మహిళలు, వృద్ధులు, ప్రజలందరూ ఉన్నారు. పోలింగ్ సరళిని పరిశీలించాం. అనుకూలమైన తీర్పే మాకు వస్తుంది.

– సంజయ్‌కుమార్, జగిత్యాల బీఆర్‌ఎస్ అభ్యర్థి

ప్రజలు మా వైపు ఉన్నారు



ప్రజలు మా వైపు ఉన్నారని ఈ ఎన్నికల్లో పోలింగ్ సరళితో స్పష్టంగా అర్థమవుతోంది. కోరుట్లలో మంచి మెజార్టీతో విజయం సాధిస్తాం. ప్రజలు మార్పు కోరుకుంటున్నారు. సెగ్మెంట్‌లో కల్వకుంట్ల కుటుంబ పాలనకు స్వస్తి పలకాలని నిర్ణయించుకున్నారు. మా విజయానికి పాటుపడిన పార్టీ కార్యకర్తలు, నాయకులకు ధన్యవాదాలు. కాంగ్రెస్‌కు ఓటేసి మా వెంట నిలిచిన ప్రజలకు ఎప్పటికీ రుణపడి ఉంటా.

– జువ్వాడి నర్సింగారావు, కాంగ్రెస్ అభ్యర్థి కోరుట్ల

నా గెలుపు ఖాయం



తెలంగాణలోని అన్ని వర్గాల ప్రజలు బీఆర్‌ఎస్ కుటుంబ పాలనపై విసిగిపోయారు. పోలింగ్ ముగిసిన తరువాత ఈ ఎన్నికల్లో నా గెలుపు ఖాయమని తేలిపోయింది. దేశంలో ఎక్కడ చూసినా మోదీ హవా కొనసాగుతోంది. ప్రధాని మోదీపై అభిమానం, కోరుట్ల సెగ్మెంట్ ప్రజలకు నేను ఇచ్చిన హామీలపై నమ్మకంతో పెద్ద ఎత్తున బీజేపీకి ఓటు వేశారు. నా గెలుపు కోసం శ్రమించిన పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలకు ధన్యవాదాలు.

– ధర్మపురి అర్వింద్, కోరుట్ల బీజేపీ అభ్యర్థి

భారీ మెజార్టీతో గెలుస్తున్నాం



ఈ ఎన్నికల్లో భారీ మెజార్టీతో విజయం సాధిస్తున్నాం. నాన్న కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు ఎమ్మెల్యేగా చేసిన అభివృద్ధి పనులు, స్థానికంగా ఉండే అభ్యర్థికి ఓటు వేయాలన్న ప్రజల తపన పోలింగ్ సరళిలో తెలిసిపోయింది. సీఎం కేసీఆర్ అమలు చేసిన పథకాలు మాకు కలిసొచ్చాయి. మా గెలుపుపై ఏలాంటి సందేహాలు లేవు. ఎక్కువ మొత్తంలో మెజార్టీతో గెలుస్తామన్న నమ్మకం నాకుంది. పార్టీ గెలుపు కోసం పనిచేసిన నాయకులకు ధన్యవాదాలు. మాపై నమ్మకంతో ఓటేసిన ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉండి ప్రజాసేవలో కొనసాగుతా.

– డా.కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు, ఎమ్మెల్యే. కోరుట్ల బీఆర్‌ఎస్ అభ్యర్థి సంజయ్

ఈసారి కాంగ్రెస్‌దే గెలుపు



ప్రజలు కాంగ్రెస్ వైపే ఉన్నారు. ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలు మమ్మల్ని గెలిపిస్తున్నాయి. రాష్ట్రంలో సైతం కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుంది. భారీ మెజార్టీతో గెలుపొందుతాం. ప్రజలు, కార్యకర్తలు, నాయకులు కాంగ్రెస్ గెలుపు కోసం చాలా కృషి చేశారు.

– టి.జీవన్‌రెడ్డి, జగిత్యాల కాంగ్రెస్ అభ్యర్థి


కాషాయ జెండా ఎగురవేస్తాం



ప్రజలు ఆడబిడ్డ వైపే ఉన్నారు. కార్యకర్తలు, నాయకులు అండగా నిలిచారు. ప్రజలు ఆశీర్వదిస్తున్నారు. జగిత్యాలలో కాషాయ జెండా ఎగురవేస్తున్నాం. గెలుపు కోసం ప్రతి గ్రామగ్రామాన, పట్టణంలో సైతం ప్రజలు మావైపు తిరిగారు. ప్రతి పోలింగ్‌కేంద్రంలో సరళిని పరిశీలించుకున్నాం. ఈసారి జగిత్యాలలో కాషాయ జెండా ఎగురవేస్తాం.

– బోగ శ్రావణి, జగిత్యాల బీజేపీ అభ్యర్థి

పూర్తి నమ్మకంతో ఉన్నా..



ప్రజలపై పూర్తి నమ్మకంతో ఉన్నా. ఓడినా, గెలిచినా ప్రజల మధ్యనే తిరిగా. మూ డుసార్లు దగ్గరగా వచ్చి ఓడిపోయి.. నాల్గోసారి గెలిచి ఓడినా ఈ సారి కచ్చితంగా ధర్మపురి నియోజకవర్గ ప్రజలు, మహిళలు, రైతులు, నిరుద్యోగ యువతీ, యువకులు నాకు అవకాశం ఇస్తారని నమ్మకంతో ఉన్నా.

– అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, ధర్మపురి కాంగ్రెస్ అభ్యర్థి

శాంతియుత వాతావరణంలో ఎన్నికలు

- కలెక్టర్ యాస్మిన్ బాషా



వెబ్‌కంట్రోల్‌రూమ్‌లో ఎన్నికల ప్రక్రియను పరిశీలిస్తున్న కలెక్టర్, ఎన్నికల అధికారులు

జగిత్యాల: శాంతియుత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయడం జరిగిందని కలెక్టర్ యాస్మిన్ బాషా అన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలోని జగిత్యాల, కోరుట్ల, ధర్మపురి నియోజకవర్గాల్లో 785 పోలింగ్ కేంద్రాలు ఉండగా అన్ని కేంద్రాల్లో ఉదయం 6 నుంచి 7 గంటల వరకు మాక్ పోలింగ్ నిర్వహించడం జరిగిందన్నారు. ఉదయం 7 నుంచి పోలింగ్ ప్రారంభం కాగా ప్రజలు తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు చలిని కూడా లెక్కచేయకుండా క్యూలో నిలబడ్డారని వివరించారు. ఓటింగ్ యంత్రాలను బెల్ ఇంజినీర్ల ఆధ్వర్యంలో తనిఖీ చేసినందున ఎక్కడా మొరాయించలేదని పేర్కొన్నారు. ఎన్నికలు సజావుగా జరిగేందుకు ఆర్వోలు పర్యవేక్షించడం జరిగిందన్నారు. జగిత్యాలలో 73.54, కోరుట్లలో 73.68, ధర్మపురిలో 77.50 శాతం పోలింగ్ నమోదైనట్లు వెల్లడించారు. జిల్లాలో మహిళ, దివ్యాంగులు, యూత్‌కు సంబంధించి 36 కేంద్రాలు ఏర్పాటు చేశామని, పోలింగ్ ప్రక్రియను నిరంతరం పర్యవేక్షించేందుకు కలెక్టరేట్‌లో వెబ్‌కాస్టింగ్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 234 మైక్రో అబ్జర్వర్లను ఏర్పాటు చేసి ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు ఎన్నికలు జరిగాయని, ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సాధారణ ఎన్నికల పరిశీలకులు రాజీవ్‌రంజన్ మీనా, హెచ్.బసవరాజేంద్ర, పోలీసు పరిశీలకులు వివేకానందసింగ్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికలు ప్రశాంతం

- ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్



నూకపల్లి వీఆర్‌కే కళాశాలలో స్ట్రాంగ్‌రూమ్‌ల వద్ద భద్రత ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎస్పీ

జగిత్యాలక్రైం: శాసనసభ ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో పకడ్బందీ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్ తెలిపారు. గురువారం ఎన్నికలు జరుగుతున్న పోలింగ్ కేంద్రాలను సందర్శించారు. ప్రజలు స్వేచ్ఛగా, నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకున్నారని వివరించారు. పెట్రోలింగ్ వాహనాలు, ప్రత్యేక పోలీసు బృందాలు నిరంతరం పర్యటిస్తూ శాంతిభద్రతలను పర్యవేక్షించడం జరిగిందన్నారు.

స్ట్రాంగ్ రూమ్‌కు ఈవీఎంలు

జిల్లాలో ప్రశాంత వాతావరణంలో ఓటింగ్ ప్రక్రియ ముగిసిందని, పోలీస్ శాఖ ఆధ్వర్యంలో 3 వేల మంది పోలీస్, కేంద్ర బలగాలతో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయడం జరిగిందని ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్ పేర్కొన్నారు. పోలింగ్ ప్రక్రియ ముగిసిన అనంతరం ఈవీఎంలను పటిష్ట బందోబస్తు మధ్య రిసెప్షన్ సెంటర్ నుంచి స్ట్రాంగ్ రూమ్ వీఆర్‌కే కాలేజీకి తరలించడం జరిగిందన్నారు.

పటిష్ట బందోబస్తు

వీఆర్‌కే కళాశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్‌రూమ్‌ల వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయడం జరిగిందని ఎస్పీ తెలిపారు. గురువారం రాత్రి వీఆర్‌కే కళాశాలలో స్ట్రాంగ్‌రూమ్‌లను పరిశీలించారు. స్ట్రాంగ్‌రూమ్‌ల భద్రతకు కేంద్ర సాయుధ బలగాలను కేటాయించామని, విధుల్లో ఉన్న అధికారులు భద్రత ఏర్పాట్లను పర్యవేక్షించడం జరుగుతుందన్నారు. కౌంటింగ్ ముగిసే వరకు భద్రతాపరమైన సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపడతామని పేర్కొన్నారు.

క్లుప్తంగా

ఓటర్లకు డబ్బులు పంచిన వ్యక్తులపై కేసు

వీణవంక(హుజూరాబాద్): మండలంలోని పలు చోట్ల గురువారం ఓటర్లకు పంచిన వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ ఆసిఫ్ తెలిపారు. బేతిగల్‌లో వీరంనేని సంపత్‌రావు నుంచి రూ. 93, 500, వీణవంకలో రాయిశెట్టి కుమార్ నుంచి రూ. 99 వేలు, చల్లూరులో మహమ్మద్ అఖిల్ పాషా, గూడెపు సమ్మయ్యల నుంచి రూ.30 వేలు పట్టుకొని, సీజ్ చేసినట్లు పేర్కొన్నారు. కనపర్తిలో బీర్లు పంచుతున్న లోకిని మల్లేశ్‌ను పట్టుకున్న ట్లు తెలిపారు. వారిపై కేసు నమోదు చేశామన్నారు.

బీఆర్‌ఎస్ నాయకుడిపై..

సారంగాపూర్(జగిత్యాల): మండలంలోని అర్పపల్లికి చెందిన బీఆర్‌ఎస్ నాయకుడు, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు సొల్లు సురేందర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తిరుపతి తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. సురేందర్ గురువారం ఓటు వేయాలని ఓటర్లను ప్రలోభపెడుతూ డబ్బులు పంచుతుండగా గుర్తు తెలియని వ్యక్తి తన ఫోన్‌లో వీడియో తీసి, పోలీసులకు పంపించాడు. దీని ఆధారంగా ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించినందుకు సురేందర్‌పై కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

దొంగ ఓటు వేసిన వ్యక్తిపై..

సాక్షి, పెద్దపల్లి: ధర్మారం మండలం బొట్లవనపర్తి గ్రామానికి చెందిన ఆకారి సత్యం దొంగ ఓటు వేశారని కేసు నమోదు చేసినట్లు ఎస్సై సత్యనారాయణ తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం.. బీఆర్‌ఎస్ యూత్ కోఆర్డినేటర్ సత్యం బొట్లవరపర్తి గ్రామంలోని 158 పోలింగ్ బూత్‌లో ఓటు వేశారు. ఓటు వేసిన సమయంలో అధికారులు చేతి వేలుకు సిరాను వేసిన, దానిని అతడు చెరిపి వేశాడు. తిరిగి రెండోసారి ధర్మారంలోని 134 పోలింగ్ బూత్‌లో మరోసారి దొంగ ఓటు వేశాడు. ఇది గమనించిన కాంగ్రెస్ పార్టీ నాయకుడు ఓరం చిరంజీవి అతనిపై పీవోకు ఫిర్యాదు చేశాడు. వెంటనే స్పందించిన ఎన్నికల అధికారులు రెండు పోలింగ్ కేంద్రాల్లో వేసిన ఓటును చెక్ చేశారు. రెండు చోట్ల ఓటు వేసినట్లు నిర్ధారించుకున్న ఎన్నికల ఎఫ్‌ఎస్‌టీ మెజిస్ట్రేట్ చలపతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ధర్మారం ఎస్సై సత్యనారాయణ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు

మల్యాల(చొప్పదండి): ముత్యంపేటలో దిగువ కొండగట్టు వద్ద రోడ్డు దాటుతున్న బైక్‌ను కారు ఢీకొనడంతో ఒకరు గాయపడ్డారు. కొండగట్టుకు చెందిన ఎల్లయ్య బైక్‌పై రోడ్డు దాటుతుండగా వేగంగా వెళ్తున్న కారు ఢీకొంది. దీంతో అతను తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు 108కు సమాచారం అందించగా, ఈఎంటీ జ్యోతి, పైలట్ అనిల్ వచ్చి, ప్రథమ చికిత్స చేసి, జగిత్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

మళ్లీ అవే ఓటు పాట్లు

రాజన్నసిరిసిల్ల జిల్లా తొలి కలెక్టర్ దేవరకొండ కృష్ణభాస్కర్ అందరికీ సుపరిచితులే. ఆయన రెండు పర్యాయాలు జిల్లాలో కలెక్టర్‌గా పనిచేశారు. రెండున్నరేళ్ల కిందట ఆయన బదిలీ అయ్యారు. కానీ కృష్ణభాస్కర్ పేరిట సిరిసిల్లలోని ఇంటి నంబరు 6–6–73లో ఓటుహక్కును కల్పించారు. జిల్లాలో పనిచేసిన కాలంలో ఓటేసుందుకు నమోదు చేసుకోగా.. ఆయన బదిలీ అయినా.. కూడా ఇంకా జిల్లా ఓటరుగా జాబితాలో ఉన్నారు.





ఇతను కోడం ప్రభాకర్. సిరిసిల్లలోని శాంతినగర్‌కు చెందిన వస్త్ర వ్యాపారి. మూడేళ్ల కిందట ప్రభాకర్ మరణించారు. కానీ ఓటర్ల జాబితాలో పేరు ప్రత్యక్షమైంది. కోడం ప్రభాకర్ కుటుంబ సభ్యులు ఓటరు జాబితాలో ప్రభాకర్ పేరును చూసి.. అవాక్కయ్యారు. చనిపోయిన వ్యక్తి పేరును ఓటర్ల సవరణలో కనీసం గుర్తించకపోవడం గమనార్హం.

- తప్పుల తడకగా ఓటరు జాబితా
- అందని ఓటరు సమాచార స్లిప్‌లు
- బదిలీ అయిన కలెక్టర్‌కు ఓటు
- చనిపోయిన వారికి జాబితాలో స్థానం
- ఇవీ సిరిసిల్ల రెవెన్యూ అధికారుల లీలలు

సిరిసిల్ల: తప్పులు లేని ఓటర్ల జాబితా లక్ష్యమంటూ రెవెన్యూ అధికారులు బూత్ లెవల్ అధికారులతో తరచూ సమావేశాలు నిర్వహించడం, సెలవు రోజుల్లో సవరణల పేరిట పోలింగ్‌స్టేషన్(స్కూల్స్)లో అందుబాటులో ఉంచడం జరుగుతుంది. కానీ రాజన్న సిరిసిల్ల జిల్లా వ్యాప్తంగా గురువారం జరిగిన ఎన్నికల్లో తప్పుల తడకలతో కూడిన ఓటర్ల జాబితాను అందుబాటులో ఉంచి గందరగోళాన్ని సృష్టించారు. క్షేత్రస్థాయి వాస్తవాలను నమోదు చేయకుండా.. పాత జాబితా ఆధారంగా తప్పుల జాబితాను ఎన్నికలకు అందుబాటులో ఉంచడం విమర్శలకు తావిస్తుంది.



పోలింగ్ కేంద్రం వద్ద ఓటర్ల జాబితా పరిశీలన

అందని ఓటరు సమాచార స్లిప్‌లు

జిల్లాలో ఇంటింటికి ఓటరు సమాచార స్లిప్‌లను అందించామని జిల్లా అధికార యంత్రాంగం గొప్పగా ప్రకటించింది. కానీ వాస్తవానికి 50 శాతం ఓటర్లకు కూడా ఆ సమాచార స్లిప్‌లను అందించలేదు. ఫలితంగా ఓటర్లు పోలింగ్‌స్టేషన్‌తోపాటు ఓటర్ల జాబితాలో తమ పేర్లు ఎక్కడ ఉన్నాయో తెలుసుకునేందుకు ఇబ్బందులు పడ్డారు. ఏ పోలింగ్ స్టేషన్‌లో ఓటు ఉందో తెలియక చాలా మంది తికమక పడ్డారు. చివరికి ఓటు వేయకుండానే వెనుదిరిగారు. ఎన్నికల సంఘం ఆదేశాలతో ఓటరు సమాచార స్లిప్‌లను పంపిణీ చేయడంలో రెవెన్యూ యంత్రాంగం పూర్తిగా విఫలమైంది. ఫలితంగా ఓటర్లు క్షేత్రస్థాయిలో ఇబ్బందులు పడ్డారు. పోలింగ్‌శాతం మరింత పెరిగే అవకాశం ఉన్నా.. అధికారుల నిర్లక్ష్యంతో జిల్లాలో గురువారం ఓటు పాట్లు తప్పలేదు.

చిగురుమామిడి జెడ్పీటీసీపై ఫిర్యాదు

- పోలింగ్ కేంద్రంలో ప్రచారం చేశాడన్న హుస్నాబాద్ ఎమ్మెల్యే
- అదుపులోకి తీసుకున్న పోలీసులు



పోలింగ్ కేంద్రం నుంచి బయటకు వస్తున్న ఎమ్మెల్యే సతీశ్‌కుమార్

చిగురుమామిడి: హుస్నాబాద్ ఎమ్మెల్యే వొడితెల సతీశ్‌కుమార్ చిగురుమామిడి జెడ్పీటీసీ గీకురు రవీందర్‌పై సీపీ అభిషేక్ మహంతికి ఫోన్‌లో ఫిర్యాదు చేశారు. సీపీ ఆదేశాలతో పోలీసులు ఆయనను అదుపులోకి తీసుకొని, పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. పూర్తి వివరాలిలా ఉన్నాయి.. చిగురుమామిడి ప్రభుత్వ పాఠశాలలో నాలుగు పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేశారు. గురువారం ఓటింగ్ ప్రారంభమవగా 131వ బూత్‌లో చీకటిగా ఉండటం వల్ల వృద్ధులు, దివ్యాంగులకు ఎన్నికల గుర్తులు కనిపించలేదు. పోలింగ్ సిబ్బంది కూడా వారికి సహకరించడం లేదని పలువురు బయటకు వచ్చారు. దీంతో జెడ్పీటీసీ రవీందర్ సంబంధిత బూత్‌లోకి వెళ్లి, ఓటువేసే గదిలో లైటింగ్ ఏర్పాటు చేయాలని చెప్పేందుకు ప్రయత్నించారు. అలాగే, చేతి గుర్తుకు ఓటు వేయాలని ఆయన ప్రచారం చేస్తున్నాడని బీఆర్‌ఎస్ కార్యకర్తలు ఎమ్మెల్యే వొడితెల సతీశ్‌కుమార్‌కు తెలియజేశారు. వెంటనే అక్కడికి చేరుకున్న ఆయన కరీంనగర్ సీపీకి ఫోన్‌లో ఫిర్యాదు చేశారు. స్పందించిన సీపీ అక్కడ విధులు నిర్వహిస్తున్న సీఐకి ఫోన్ చేసి, తక్షణమే రవీందర్‌ను అదుపులోకి తీసుకోవాలని ఆదేశించారు. ఆ తర్వాత సీఐ తన సిబ్బందితో ఆయనను ఠాణాకు తరలించారు. మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు రవీందర్ పోలీసు కస్టడీలో ఉన్నారు.

కావాలనే ఫిర్యాదు చేశారు : జెడ్పీటీసీ రవీందర్

పోలింగ్ కేంద్రంలో నేను ఎలాంటి ప్రచారం చేయలేదు. 131వ బూత్‌లో చీకటిగా ఉందన్న సమాచారంతో పోలింగ్ అధికారికి విషయాన్ని చెప్పేందుకు వెళ్లాను. అంతేగానీ ఎన్నికల నిబంధనలు అతిక్రమించలేదు. ఎమ్మెల్యే సతీశ్‌కుమార్ కావాలనే నాపై పోలీసులకు ఫిర్యాదు చేశారు.

రాష్ట్రంలో రాబోయేది కాంగ్రెస్ ప్రభుత్వమే

- సీపీఐ జాతీయ కౌన్సిల్ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి



మాట్లాడుతున్న వెంకట్‌రెడ్డి

చిగురుమామిడి: రాష్ట్రంలో రాబోయేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని సీపీఐ జాతీయ కౌన్సిల్ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకట్‌రెడ్డి అన్నారు. గురువారం చిగురుమామిడి మండలంలోని రేకొండ పరిధి పెద్దమ్మపల్లెలో ఆయన ఓటు వేశారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ పదేళ్ల పాలను ఓటర్లు చమరగీతం పాడబోతున్నారని తెలిపారు. రాష్ట్రంలో సీపీఐ బలపర్చిన కాంగ్రెస్ అభ్యర్థులందరూ గెలవబోతున్నారని పేర్కొన్నారు. హుస్నాబాద్ నుంచి మాజీ ఎంపీ, కాంగ్రెస్ అభ్యర్థి పొన్నం ప్రభాకర్ విజయం సాధిస్తారని ధీమా వ్యక్తం చేశారు. ఏ గ్రామంలో చూసినా ఎక్కువ మంది ఓటర్లుచేతి గుర్తుకు మొగ్గు చూపారన్నారు. సీపీఐ మండల కార్యదర్శి నాగెల్లి లక్ష్మారెడ్డి, కాంగ్రెస్ మండలశాఖ అధ్యక్షుడు కంది తిరుపతిరెడ్డి, సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యుడు చాడ శ్రీధర్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

దూరభారం.. ఓటుపై మమకారం

- దేశవిదేశాల నుంచి వచ్చిన జిల్లావాసులు

సిరిసిల్ల/వేములవాడ/తంగళ్లపల్లి: ఎన్నికల వేళ.. దూరభారాన్ని అధిగమించి ఓటు వేసేందుకు రావడం విశేషం. ఊరిలో ఉండి.. ఓటు వేసేందుకు సైతం పోలింగ్‌స్టేషన్ వరకు రాకుండా.. నిర్లక్ష్యం చేసే ఈ రోజుల్లో హైదరాబాద్‌తోపాటు విదేశాల్లో ఉన్న వారు సైతం ఓటు వేసేందుకు రాజన్నసిరిసిల్ల జిల్లాకు వచ్చారు. స్వగ్రామానికి వచ్చి కుటుంబ సభ్యులతో కలిసి తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. వేములవాడకు చెందిన ఎన్‌ఆర్‌ఐ తోట రామ్ కుమార్, జావిద్ దుబాయ్ నుంచి వచ్చి ఓటు వేశారు. కాన్పూర్ ఐఐటీలో బీటెక్ సెకండియర్ చదువుతున్న తంగళ్లపల్లి మండలం చిన్న లింగాపూర్‌కు చెందిన చీకోటి శ్రీహిత ఓటుహక్కు కోసం స్వగ్రామానికి వచ్చింది.







దుబాయ్ నుంచి వచ్చిన రామ్‌కుమార్, జావిద్, కాన్పూర్ నుంచి వచ్చిన శ్రీహిత

ఓటు వేసేందుకు వచ్చాం



మాది కోనరావుపేట మండలం బావుసాయిపేట. మేమిద్దరం హైదరాబాద్‌లోని నిజాంపేటలో ఉంటాం. మా ఇద్దరు అబ్బాయిలలో ఒకరు డాక్టర్, ఇంకొకరు ఇంజినీర్. మాకు స్వగ్రామంలోనే ఓటుహక్కు ఉంది. ఓటు వేసేందుకు హైదరాబాద్ నుంచి వచ్చాం. బంధువులతో కలిసి ఇలా ఓటు వేయడం సంతోషంగా ఉంది. స్నేహితులందరూ కలిశారు.

– చీటి రామారావు–జలజ దంపతులు, బావుసాయిపేట

ప్రతీసారి ఇక్కడే ఓటు వేస్తాం



మాది తంగళ్లపల్లి మండలం జిల్లెల్ల. ప్రతీసారి ఎన్నికల సమయంలో ఇక్కడికే వచ్చి ఓటు వేస్తాం. ఉద్యోగరీత్యా హైదరాబాద్‌లో స్థిరపడ్డాం. ఏ ఎన్నికలు వచ్చినా.. ఓటు వేయడం మాత్రం మా ఊరిలోనే. ఈసారి ముందే ప్లాన్ చేసుకుని వచ్చి ఓటు వేశాం. మా అన్న విజయేందర్‌రెడ్డి, వదినే సంధ్య, మా కూతురు మనస్వితారెడ్డి, మా ఆవిడ ఉమాతో కలిసి ఓటు వేయడం ఆనందంగా ఉంది.

– పబ్బతి జితేందర్‌రెడ్డి –ఉమా దంపతులు, జిల్లెల్ల

ఓటువేసి.. వరి కోయించేందుకు వెళ్లి

- గుండెపోటుతో రైతు మృతి
- ముత్తారంలో ఘటన



రాజయ్య మృతదేహం

ముత్తారం(మంథని): ఓటువేసి.. వరి కోయించేందుకు పొలం వద్దకు వెళ్లిన ఓ రైతు గుండెపోటుతో మృతిచెందాడు. వివరాల్లోకి వెళ్తే.. ముత్తారానికి చెందిన రాపెల్లి రాజయ్య(65) గురువారం ఉదయం ఓటుహక్కు వినియోగించుకున్నాడు. తర్వాత తన కున్న ఎకరం భూమిలో వరి కోయించేందుకు వెళ్లాడు. పొలం దిగబడుతుండటంతో కోత మెషీన్ వచ్చేలోపు కొంతవరకు కోశాడు. దాన్ని కుప్ప చేస్తుండగా ఒక్కసారి చాతిలో నొప్పి, రావడంతో అక్కడే కుప్పకూలిపోయాడు. అటుగా వెళ్లిన ఓ రైతు రాజయ్యను చూసి, లేపే ప్రయత్నం చేశాడు. లేవకపోవడంతో అతను చనిపోయాడన్న సమాచారాన్ని కుటుంబసభ్యులకు చేరవేశాడు. ఓటు వేసి, పొలంకాడికి పోయి, తిరిగిరాని లోకాలకు వెళ్లిపోయావా అంటూ మృతుడి కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. అతనికి భార్య కనకలక్ష్మి, కుమారుడు, కూతురు ఉన్నారు.

బీఆర్‌ఎస్ గెలుస్తుందని సంబరాలు



సిరిసిల్లలో వేడుకల్లో పాల్గొన్న చీటి నర్సింగరావు, బీఆర్‌ఎస్ నాయకులు

సిరిసిల్లటౌన్/సిరిసిల్లక్రైం: సిరిసిల్లలో బీఆర్‌ఎస్ మళ్లీ గెలువబోతుందని ఆ పార్టీ నాయకులు గురువారం సంబరాలు జరిపారు. రాష్ట్ర నాయకుడు చీటి నర్సింగరావు ముఖ్య అతిథిగా బీఆర్‌ఎస్ యూత్ విభాగం నేతృత్వంలో స్థానిక అంబేడ్కర్ చౌరస్తాలో టపాసులు పేల్చి, నినాదాలు చేశారు. ఓటింగ్ సరళితో మంత్రి కేటీఆర్ మళ్లీ గెలుస్తున్నారని, సిరిసిల్ల మరింత అభివృద్ధి సాధిస్తుందని పేర్కొన్నారు. బీఆర్‌ఎస్ యూత్ విభాగం అధ్యక్షుడు సుంకపాక మనోజ్‌కుమార్, షేక్ సికింధర్, సామల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. కాగా ఫలితాలు వెలువడకముందే ఎన్నికల కమిషన్ నిబంధనలు అతిక్రమిస్తూ బీఆర్‌ఎస్ పార్టీ సంబరాలు నిర్వహించడం ఏందని స్థానికంగా విమర్శలు రావడం గమనార్హం.

బీఆర్‌ఎస్ పక్షాన ప్రజలు

- అభివృద్ధిని చూసి ఆశీర్వదించనున్నారు
- బీఆర్‌ఎస్ అసెంబ్లీ అభ్యర్థి, మంత్రి గంగుల కమలాకర్



మాట్లాడుతున్న మంత్రి కమలాకర్

కరీంనగర్: బీఆర్‌ఎస్ పక్షాన ప్రజలు నిలిచారని, కాంగ్రెస్, బీజేపీల మాటలు నమ్మబోరని, పదేళ్లుగా జరిగిన అభివృద్ధిని చూసి మరోసారి బీఆర్‌ఎస్‌కు పట్టం కట్టనున్నారని కరీంనగర్ అభ్యర్థి, మంత్రి గంగుల కమలాకర్ అన్నారు. గురువారం ఓటు వేసిన ఆనంతరం మీడియాతో మాట్లాడుతూ.. ఆరు దశాబ్దాలుగా పరిపాలించిన రాజకీయ పార్టీలు తెలంగాణ అభివృద్ధిని విస్మరించాయని అన్నారు. నీళ్లు, నిధులు, నియామకాల కోసం పుట్టిన బీఆర్‌ఎస్ పార్టీ అధినేత సీఎం కేసీఆర్ సారథ్యంలో పదేళ్లల్లోనే గణనీయమైన అభివృద్ధి జరిగిందని గుర్తు చేశారు. సంక్షేమ పథకాలతో ప్రభుత్వం ముందుకు సాగుతుంటే ప్రతిపక్షాలకు కళ్లమంట మొదలైందని అన్నారు. ఏదిఏమైనా రాష్ట్రంలో మరోసారి బీఆర్‌ఎస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని, కరీంనగర్‌లో అత్యధిక మెజార్టీతో తాను గెలవడం తథ్యమని ఈ సందర్భంగా పేర్కొన్నారు.

సవాల్ విసిరి, పారిపోయాడు

- మంత్రి గంగులపై బీజేపీ అభ్యర్థి బండి సంజయ్‌కుమార్



మాట్లాడుతున్న ఎంపీ సంజయ్‌కుమార్

కరీంనగర్‌టౌన్: తాను డబ్బు పంచానని ఆరోపించి, ప్రమాణం చేయాలంటూ సవాలు విసిరిన బీఆర్‌ఎస్ అభ్యర్థి కమలాకర్ పారిపోయాడని బీజేపీ జాతీయ ప్రధానకార్యదర్శి, అభ్యర్థి ఎంపీ బండి సంజయ్‌కుమార్ ఎద్దేవా చేశారు. కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌లు బీజేపీని అప్రతిష్టపాలు చేయాలని చూస్తున్నాయని విమర్శించారు. గురువారం కరీంనగర్ జ్యోతినగర్‌లో 174వ పోలింగ్ బూత్‌లో కుటుంబ సభ్యులతో కలిసి ఓటుహక్కును వినియోగించుకున్నారు. అనంతరం సంజయ్ మీడియాతో మాట్లాడారు. బీజేపీ దాడులు చేస్తుందని, మరేదో చేస్తుందంటూ తనపై సామాజిక మాధ్యమాల ద్వారా బురద చల్లే ప్రయత్నం చేశారని, వాటిని ప్రజలు నమ్మలేదని అన్నారు. జలాల విషయంలో పక్క రాష్ట్రంతో కుమ్మక్కయిన కేసీఆర్ తెలంగాణకు అన్యాయం చేశాడన్నారు. కరీంనగర్ పట్టణంతో పాటు కొత్తపల్లి, కరీంనగర్ రూరల్ మండలాల్లో వివిధ గ్రామాలకు వెళ్లి ఓటింగ్ సరళి తెలుసుకున్నారు.

ఓటర్లపై కుక్క దాడి : పది మందికి తీవ్ర గాయాలు

ముస్తాబాద్(సిరిసిల్ల): మండలంలోని పోతుగల్‌లో జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలోని పోలింగ్ కేంద్రం వద్ద ఓటర్లపై ఓ కుక్క దాడిచేసింది. పోలింగ్ కేంద్రానికి ఓటేసేందుకు వచ్చిన వారిపై కుక్క విచక్షణ రహితంగా దాడి చేసింది. బూత్‌నంబర్ 206, 207 పోలింగ్ కేంద్రాల ఎదుట వేచి ఉన్న పది మందిపై కుక్క దాడి చేసింది. కుక్క దాడిలో కొండెల్లి నర్సయ్య, సీహెచ్.లస్మవ్వ, ఆర్.పద్మ, నల్ల చారి, జవహర్ తీవ్రంగా గాయపడ్డారు. మోహర్ల నర్సవ్వ, రేసు రఘు, జంగ భూమరాజం, దిలీప్, బొదాసు రాజు గాయపడ్డారు. వీరిని స్థానిక పీహెచ్‌సీకి తరలించి చికిత్స అందించారు. తీవ్రంగా గాయపడ్డ నర్సయ్య, లస్మవ్వ, జవహర్‌లను సిరిసిల్ల జిల్లా ఆసుపత్రికి తరలించారు.



విద్యుదాఘాతంతో బాలుడి మృతి



బాలుడి మృతదేహం

మానకొండూర్: మండలంలోని గంగిపల్లికి చెందిన గాడిచర్ల అజయ్‌కుమార్(14) విద్యుదాఘాతంతో మృతిచెందాడు. సీఐ రాజ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. అజయ్‌కుమార్ తన తాత లింగయ్యతో కలిసి గురువారం వ్యవసాయ బావి వద్దకు వెళ్లాడు. విద్యుత్ మోటార్‌కు ఉన్న నల్లా వాల్వ్‌ను ఆఫ్ చేయడానికి ప్రయత్నించగా ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్ తగి లి, అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని ఒకరు..



సత్తయ్య మృతదేహం

సిరిసిల్లక్రైం: సిరిసిల్ల బైపాస్‌లో గురువారం రాత్రి గుర్తుతెలియని వాహనం ఢీకొన్న ఘటనలో శాంతినగర్‌కు చెందిన సత్తయ్య(40) మృతిచెందాడు. మృతుని బంధువులు తెలిపిన వివరాలు. సత్తయ్య బైపాస్ రోడ్డు నుంచి శాంతినగర్‌కు వెళ్లడానికి బైపాస్ మీదుగా కాలినడకన వస్తున్నాడు. అదే సమయంలో గుర్తుతెలియని వాహనం ఢీకొట్టి వెళ్లింది. స్థానికులు హుటాహుటిన క్షతగాత్రున్ని సిరిసిల్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలపడంతో బంధువులు కరీంనగర్ తరలించేందుకు ప్రయత్నించగా దారి మధ్యలోనే సత్తయ్య మృతి చెందాడు.

సాక్షి క్లాసిఫైడ్స్

SERVICES

BUSINESS OFFER

■కంపెనీ అన్ని రకాల బిజినెస్ ల్యాప్ ప్రాజెక్ట్‌ను అందిస్తుంది.వ్యక్తిగత,విద్య,టేక్ఓవర్ అగ్రికల్చర్ ఏజెంట్‌కావలెను.DMA Welcome, Salary + కమీషన్ ఆఫీసు, ఖర్చులు, ✆ 9311685170. [T-1258784]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classifieds, Advertisements Contact:
9951602933
9951602824

సర్వం సాంకేతికమయం

- పోలింగ్ కేంద్రాల్లో ఇన్‌సైడ్, ఔట్‌సైడ్ వెబ్‌కాస్టింగ్
- జిల్లా నుంచి రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వ ఎన్నికల విభాగం వరకు వీక్షణ
- కొనసాగుతున్న ఎఫ్‌ఎస్‌టీ, ఎస్‌ఎస్‌టీ తనిఖీలు

కరీంనగర్ అర్బన్: సీసీ కెమెరాలు, వెబ్‌కాస్టింగ్ సర్వం సాంకేతికమయమే. అసెంబ్లీ సాధారణ ఎన్నికల క్రమంలో తొలిసారిగా అత్యాధునిక సాంకేతికతను వినియోగించారు. పోలింగ్ కేంద్రాల నుంచి ఫ్లయింగ్ స్క్వాడ్, స్టాటిక్ సర్వలైన్ టీంలకు అత్యంత ఆధునిక కెమెరాలు వినియోగించగా కలెక్టరేట్ ప్రధాన విభాగంతో పాటు జిల్లా ఎన్నికల అధికారి పమేలా సత్పతి నిరంతరం వీక్షిస్తుండగా రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వ ఎన్నికల విభాగం వీక్షించేలా అనుసంధానించారు. అసెంబ్లీ ఎన్నికల చరిత్రలో ఇదే తొలిసారి కాగా ప్రత్యేక సాంకేతిక సిబ్బందిని వినియోగించారు. గురువారం జరిగిన పోలింగ్‌పై జిల్లాస్థాయి అధికారులు పర్యవేక్షణ చేయగా ఎప్పటికప్పుడు పోలీస్, ఎన్నికల అధికారులను అప్రమత్తం చేశారు. జిల్లాలో 1,338 పోలింగ్ కేంద్రాలకు గానూ 899 కేంద్రాల్లో ఇన్‌సైడ్ వెబ్‌కాస్టింగ్ ఏర్పాటు చేయగా మిగతా పోలింగ్ కేంద్రాల్లో ఔట్‌సైడ్ వెబ్‌కాస్టింగ్ నిర్వహించారు. ఆయా పోలింగ్ కేంద్రాల్లో గొడవలు, ఎక్కువగా మంది గుమికూడటం, దివ్యాంగులు, వృద్ధుల కోసం ఏర్పాట్లు, ఈవీఎం యంత్రాల పనితీరును పరిశీలిస్తూ అధికారులను అప్రమత్తం చేశారు. జిల్లా వ్యవసాయ అధికారి వి.శ్రీధర్, సివిల్ సప్లయ్ కార్పొరేషన్ డీఎం ఎం.రజనీకాంత్, ఎస్‌ఐసీ ఏడీఎం శ్రీరామ్ శ్రీనివాస్‌రెడ్డిలు ఎప్పటికప్పుడు పరిశీలించగా ఆయా విభాగాలను అప్రమత్తం చేశారు.



పోలింగ్ కేంద్రాల తీరును గమనిస్తున్న అధికారి

కొనసాగుతున్న తనిఖీలు

ఫ్లయింగ్ స్క్వాడ్ టీం, స్టాటిక్ సర్వలైన్ టీంల తనిఖీలు గురువారం కూడ కొనసాగాయి. ఫ్లయింగ్ స్క్వాడ్ వాహనాలకు బిగించిన సీసీ కెమెరాల ద్వారా సదరు వాహనాలు ఎటెటు వెళుతున్నాయి, ఎంత సమయంలో ఫిర్యాదును పరిష్కరించాయి వంటి అంశాలను పరిశీలించగా జిల్లాలో ఏర్పాటు చేసిన ఎస్‌ఎస్‌టీ టీంలు(చెక్‌పోస్టులు)ల్లో వారి పనితీరును నిశితంగా గమనించారు.

వ్యక్తి బలవన్మరణం

గంగాధర(చొప్పదండి): మండలంలోని లక్ష్మీదేవిపల్లికి చెందిన కూన లచ్చయ్య(58) ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్‌ఐ అభిలాష్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. లచ్చయ్యకు భార్య లక్ష్మీనర్సమ్మ, ఇద్దరు కూతుళ్లు, ఒక కుమారుడు ఉన్నారు. ఆయన కూలీ పని చేస్తూ కుటుంబాన్ని పోషించాడు. ఇటీవల అప్పులు చేసి, కూతుళ్లకు వివాహాలు చేశాడు. వాటిని ఎలా తీర్చాలంటూ నిత్యం బాధపడుతూ మద్యానికి బానిసయ్యాడు. ఈ నేపథ్యంలో బుధవారం రాత్రి ఇంట్లోనే ఉరేసుకున్నాడు. గురువారం ఉదయం కుటుంబసభ్యులు లేచి చూసేసరికి మృతిచెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

హోం ఓటు వేసిన వృద్ధుడి మృతి



బక్కయ్య (ఫైల్)

రాయికల్(జగిత్యాల): మండలంలోని అయోధ్య గ్రామానికి చెందిన బొల్లె బక్కయ్య(85) నవంబర్ 25వ తేదీన హోం ఓటింగ్‌లో పాల్గొన్నాడు. ఈక్రమంలో అనారోగ్యంతో గురువారం మృతిచెందాడు. ఓటింగ్ పాల్గొన్న బక్కయ్య తన ఓటును లెక్కించేలోపే మృతిచెందాడు.

గెలుపోటములపై జోరుగా బెట్టింగ్

- బీఆర్‌ఎస్ వర్సెస్ కాంగ్రెస్
- రాజన్న సిరిసిల్ల జిల్లాలో జోరుగా చర్చ
- రెండు నియోజకవర్గాల్లో టెన్షన్

సిరిసిల్లక్రైం: జిల్లాలో రెండు నియోజకవర్గాల్లో ఇన్నాళ్లు అధికారంలో ఉన్న బీఆర్‌ఎస్ నాయకులకు, ప్రజల నుంచి అత్యంత స్పందన అచిర కాలంలో గట్టి పోటీనిచ్చిన కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు గెలుపోటములపై కార్యకర్తలు, అభిమానులు జోరుగా బెట్టింగ్‌లకు పాల్పడుతున్నారు. వేములవాడ, సిరిసిల్ల నియోజకవర్గాల్లో జరిగిన పోలింగ్‌ను భారత్ పాకిస్థాన్ క్రికెట్ పోటీని వీక్షించిన విధానంలో ఓట్ల లెక్కింపును చూసే అవకాశాలున్నాయని సీనియర్ నాయకులు అభిప్రాయపడుతున్నారు. ఇప్పటికే లక్షల రూపాయల్లో బెట్టింగ్‌కు ఆజ్యం పలికిన నాయకులు ఉన్నారని, ఇలా బెట్టింగ్ చేసిన వారందరూ ఓట్ల లెక్కింపు జరిగే ఆదివారం ఒకే వేదికగా ఉండి పండుగ చేసుకునేందుకు ప్రణాళికలు జరుగుతున్నాయి. సిరిసిల్ల నియోజకవర్గంలో అభివృద్ధిని ప్రచారం చేసిన కేటీఆర్‌కు విజయం కాస్త అటు.. ఇటుగా ఉంటుందనుకుంటున్న వాళ్లు లేకపోలేదు. కానీ వేములవాడలోని త్రిముఖ పోరులు అందరూ ఉద్దండులేనని ఇక్కడి ఫలితాలపై నియోజకవర్గప్రజలు అత్యంత ఆసక్తిగా ఉన్నారని సమాచారం. ఏది ఏమైనా గత ఎన్నికల కంటే ఈ ఎన్నికల్లో నేతలు హోరాహోరీగా ప్రచారాలు, పార్టీల బడా నేతలు రావడం వంటి వాటితో గెలుపు ఆయా పార్టీ బాధ్యులు ఆసక్తిగా ఎదురుచూస్తూ బెట్టింగ్‌లకు దిగుతున్నట్లు విశ్వసనీయంగా తెలిసింది. ఇలాంటి విధానాలను పోలీసు అధికారులు ఎలా నియంత్రిస్తారో వేచిచూడాల్సిందే.